మా ఆవిడ సంచీ తెరచి పాము కాటుకు గురయ్యేది. వెళ్ళకపోతే రాత్రి భోజనానికి సంచీ విప్పిన నాకూ అదే గతి పట్టేది."

బుద్ధుడు చిరునవ్వుతో ఆ గ్రామస్థుడితో చెప్పాడు.

"జీవితం అనే కారడివిలో ఏ దిక్కునించి ఎలాంటి అపాయం వస్తుందో అని జాగ్రత్తగా తిరుగుతాం. కాని మననో, మన ప్రియమైనవారినో చంపే అపాయాన్ని నిత్యం మన భుజాల మీదే మోస్తున్నామన్న సంగతిని మాత్రం మనం విస్మరిస్తాం. ఆ అపాయమే అహంకారం. దాన్ని ఆత్మజ్ఞాని అయిన గురువు చేతికి ఇస్తే, గురువు నిన్ను మరణం నించే కాక, జననం నుంచి కూడా రక్షిస్తాడు."

## 77. రెండు పాఠాలు

ముక్తికాంత మీద మనసు పడ్డ ఓ వ్యక్తి ఆత్మజ్ఞాని అయిన ఓ గురువు దగ్గరకు వెళ్ళి వినయంగా ఆయన పాదాలకి నమస్కరించి చెప్పాడు.

"స్వామి! మోక్షపు తాళంచెవి సద్గురువు దగ్గర ఉంటుందంటారు. దయచేసి నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి, ఈ జన్మలోనే నేను ముక్తిని పొందేలా అనుగ్రహించవలసిందిగా కోరుతున్నాను."

"నీకు నా గురుత్వం నచ్చుదేమో?" అనుమానం వ్యక్తం చేసాడా గురువు.

"అలాంటిదేం లేదు స్వామి."

ఆ రాత్రి పది మైళ్ళ దూరంలో ఉన్న ఓ గ్రామానికి శిష్యుడ్ని తీసుకెళ్ళాడు గురువు. అక్కడ రాత్రి పదిన్నర దాకా గ్రామస్థులకి రామాయణం కథని శిష్యుడి చేత చెప్పించాడు గురువు. కథ పూర్తయ్యేసరికి శిష్యుడికి ఆకలి దంచేస్తోంది. గ్రామస్థులు వారిద్దరికీ భోజనం తెచ్చారు.

"ఇవాళ ఏకాదశి. ఉపవాసం." గురువు భోజనాన్ని తిరస్కరించాడు.

గురువు తినక పోవడంతో గ్రామస్థులు శిష్యుడికి కూడా భోజనం పెట్టలేదు. ఆ రాత్రి కొద్దిసేపు పడుకున్నాక నిద్ర పోతున్న శిష్యుడ్ని లేపి చెప్పాడు గురువు.

" మన ఆశ్రమానికే పోదాం పద."

గురువు వెంట మళ్ళీ పదిమైళ్ళు నడిచి వెళ్ళాడు శిష్యుడు. అలసటతో పక్కమీదకి చేరబోతూంటే గురువు శిష్యుడితో చెప్పాడు.

"ఆ లాంతరు తీసుకురా. నీకు గురు గీతలోని కొన్ని శ్లోకాలు నేర్పించాలి."

శిష్యుడు అతి కష్టం మీద నిద్రని ఆపుకుని గురువు చెప్పేది విన్నాడు.

"సరే. ఇంక పడుకో."

శిష్యుడు పక్క మీదకి చేరాడు. అయిదు నిముషాలకి నిద్ర పడుతున్న శిష్యుడ్ని గురువు మళ్ళీ లేపి చెప్పాడు.

"నాకు ఒకింత ఆకలిగా ఉంది. నానపెట్టిన పెసలున్నాయి. వాటిలో సగాన్ని కాస్తంత ఉడికించి తీసుకురా."

శిష్యుడు గురువుని మనసులోనే తిట్టుకుంటూ ఆ పెసలని ఉడికించి తెచ్చాడు.

వాటిని రుచి చూసి గురువు చెప్పాడు.

"ఉప్పు వేసావేంటి? ఉప్పు లేకుండా మిగిలినవి ఉడికించి తీసుకురా."

'అది ముందే చెప్పి ఉండచ్చుగా' అని తన మనసులో చెలరేగే అసహనాన్ని, కోపాన్ని అణచుకుంటూ ఉప్పు లేకుండా పెసలని ఉడికించి గురువు దగ్గరకి తెచ్చేసరికి ఆయన గురక పెట్టి నిద్రపోతూ కనిపించాడు. ఆయన్ని లేపితే ఏం కోపం వస్తుందో అనుకుని లేపదలచుకోలేదు. ఆకలిగా ఉండటంతో ఎటూచేసా కదా అని శిష్యుడు కొంత నోట్లో ఉంచుకున్నాడు.

అంతే! నిద్రపోతున్న గురువు తక్కున లేచి కోపంగా అరిచాడు.

"గురు ద్రోహి! గురువు తినకుండా నువ్వు తింటావా?"

వెంటనే శిష్యుడు పెసల గిన్నెని నేలకేసి విసిరి కొట్టాడు. గబ గబ బయటకి వెళ్తున్న శిష్యుడి వంక చూసి నవ్వుతూ చెప్పాడు గురువు.

"నువ్వు అదృష్టవంతుడివి, నా దగ్గర శిష్యరికం మొదలెట్టిన మొదటి రోజే నీకు రెండు పాఠాలు బోధించాను. మన శరీర సౌఖ్యాన్ని త్యాగం చేసి ఇతరులకి సేవ చేయాలన్నది మొదటిది. రెండోది సహనం. ఎవరిమీదా కోపం తెచ్చుకోకూడదు. కోపం వచ్చినా దాన్ని ప్రదర్శించకుండా దాచుకోవాలి."

తనకి ఆధ్యాత్మిక పాఠాలు నేర్పించడానికి గురువు అలా ప్రవర్తించాడు అని గ్రహించిన ఆ శిష్యుడు వెంటనే క్షమించమంటూ గురువు పాదాలమీద పడ్డాడు.

## 78. ఏది బలమైంది?

ఓ సారి సూర్యుడికి, వాయుదేవుడికి తామిద్దరిలో ఎవరు గొప్పంటే ఎవరు గొప్పని లడాయి పడింది.

"చూస్తూండు. నీకన్నా నేనే శక్తిమంతుడ్నని తక్షణం ఋజువు చేస్తాను. ఆ మనిషి ఒంటి మీద చలికి కప్పుకున్న శాలువాని తీసేస్తాను." గాలి చెప్పింది.

వెంటనే తుఫాను వేగంతో గాలి అతని మీదకి వెళ్ళింది. కాని, ఆ మనిషి ఆ శాలువాని తన ఒంటి చుట్టూ ఇంకాస్త గట్టిగా చుట్టుకుని, గట్టిగా పట్టుకోవడంతో ఆ గాలి అతని ఒంటి మీది శాలువాని ఎగర కొట్టలేక పోయింది. గాలి ఓడిపోయానని ఒప్పుకున్నాక సూర్యుడి వంతు వచ్చింది. సూర్యుడు మేఘాల చాటునించి బయటకి వచ్చి, ఆ శాలువా కప్పుకున్న అతన్ని చూసి మధురంగా నవ్వాడు.

కొద్దిసేపట్లోనే అతను తన నుదుట పట్టిన చెమటని తుడుచుకుని, తన ఛాతీ మీద కప్పుకున్న శాలువాని తీసేసాడు. సూర్యుడు గాలితో చెప్పాడు.